కోరిమరీ కొంటారు..

కోహీర్ జాంపండు

- రుచిలో 'కోహినూర్'గా పేరు
- దేశంలోనే అరుదైన 'సఫేదా' రకం
- 350 ఎకరాల్లో తోటల సాగు

కోహినూరు వజ్రానికి ఎంత పేరుందో.. కోహీర్ జామ పండుకూ అంతే పేరుందని స్థానికులు చెప్పుకుంటారు. ఇక్కడి సఫేదా రకం జామకు రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్ ఉంది. తెలుపు రంగులో మెరిసిపోతూ.. ఎర్రనిచారలతో.. తక్కువ గింజలతో తీయగా నోరూరిస్తుంది. ఈ ప్రాంతంవారు బంధువుల దగ్గరికి వెళ్తే జామపండ్లను బహుమతిగా ఇస్తుంటారు.

7





వైభవంగా అఖండ కోటి దీపారాధన

వట్‌పల్లి మండలం దుద్యాలలోని సర్వేశ్వరపురి క్షేత్రంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి నిర్వహించిన అఖండ కోటి దీపారాధన కన్నుల పండువగా జరిగింది. సర్వేశ్వరాంబిక శివయోగి స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని వివిధ రూపాల్లో దీపాలను అలంకరించారు. అనంతరం క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-వట్‌పల్లి, (ఆంధ్రజ్యోతి)



జహీరాబాద్ సమీకృత మార్కెట్‌లో ఉపయోగంలోకి రాని దుకాణాలు

రూ. కోట్లు ఖర్చు చేసినా

ఏం ఫాయిదా!

జహీరాబాద్‌లో వినియోగంలోకి రాని సమీకృత మార్కెట్ భవనం

వేలం వేసిన మడిగెలను అప్పగించడంలో ఆలస్యం

బిల్లుల కోసం కాంట్రాక్టర్.. దుకాణాల కోసం వ్యాపారుల ప్రదక్షిణలు

జహీరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోట్ల రూపాయలు వెచ్చించి చేపట్టిన పనులు వినియోగంలోకి వస్తేనే ప్రజలకు ఉపయోగం.. చేసిన పనికి సార్థకత ఉంటుంది. కానీ బిల్లుల చెల్లింపులో జాప్యంతో జహీరాబాద్ సమీకృత మార్కెట్ భవనం నిరుపయోగంగా మారింది. మరోవైపు వేలంలో దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులు ఎప్పుడు స్వాధీనం చేస్తారోనని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పట్టణంలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి 2020లో అప్పటి ప్రభుత్వం రూ. 11కోట్లు మంజూరు చేయగా 2022లో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవం జరిగినా బిల్లులు రాకపోవడంతో భవన నిర్మాణ కాంట్రాక్టరు మున్సిపాలిటీకి అప్పగించలేదు. అప్పట్లో మాజీ మంత్రి హరీశ్‌రావు

మిగతా 8వ పేజీలో..

సంగారెడ్డి కలెక్టరేట్‌పై

నిఘా ఏదీ?

- మొన్న మద్యం సీసాల బాగోతం
- నిన్న సీపీవోలో అగ్ని ప్రమాదం
- కార్లు, బైక్‌ల పార్కింగ్‌కు అడ్డాగా మారిన వైనం
- రాత్రివేళలోనూ పెద్ద సంఖ్యలో వాహనాల పార్కింగ్
- పలు కార్యాలయాల్లో ప్రమాదకరంగా కరెంట్ వైరింగ్
- షార్ట్‌సర్క్యూట్ జరిగినా రక్షణ చర్యలు శూన్యం

జిల్లా పరిపాలన యంత్రాంగానికి గుండెకాయ వంటి కలెక్టరేట్‌పై నిఘా కొరవడింది. ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనలే ఇందుకు నిదర్శనం. అధికారిక కార్యకలాపాలకు చిరునామాగా ఉండాల్సిన కలెక్టరేట్.. ఇతరాత్ర విషయాల్లో చర్చనీయాంశంగా మారుతున్నది. ఇందుకు అధికారుల పర్యవేక్షణాలోపం.. నిఘా వైఫల్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన పరిణామాలతో కలెక్టర్ స్పందించి చర్యలకు ఉపక్రమించినా.. ఇప్పటికీ అనేక అంశాల్లో లోటుపాట్లు కనిపిస్తున్నాయి.



సంగారెడ్డి కలెక్టరేట్





సంగారెడ్డి కలెక్టరేట్‌లో ధ్వంసమైన సీలింగ్, విరిగిన ఫ్యాను, వేలాడుతున్న లైట్లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, నవంబరు 27: సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ తరచుగా వార్తల్లో నిలుస్తున్నది. సమీకృత కార్యాలయ ఆవరణలో ఇటీవల మద్యం ప్రియులు విందు చేసుకున్న విషయం ఇటీవల వెలుగులోకి రావడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటన మరువకముందే మూడు రోజుల క్రితం చోటుచేసుకున్న అగ్నిప్రమాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సిబ్బంది గమనించి వెంటనే మంటలు ఆర్పేయడంతో ముప్పు తప్పింది. లేదంటే భారీ నష్టమే వాటిల్లేది.

అగ్నిప్రమాదంపై సందేహాలెన్నో..

కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదంలో కార్యాలయంలోని కంప్యూటర్, ఏసీ, కొన్ని ఫైళ్లు దగ్ధమయ్యాయి. కార్యాలయ సిబ్బంది ట్యూబ్‌లైట్ స్విచ్ వేసిన కాసేపటికి షార్ట్‌సర్క్యూట్ జరిగిందని అంటున్నారు. ఒకవేళ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగితే వస్త్రంతో కూడిన ఫర్నీచర్ దగ్ధం కావాల్సి ఉంటుంది. కానీ టేబుల్ మీద ఉన్న కంప్యూటర్, గోడకు ఉన్న ఏసీ మాత్రమే పూర్తిగా దగ్ధమయ్యాయి. ఒకట్రెండు ఫైళ్లు కూడా కాలినట్లుగా తెలుస్తున్నప్పటికీ అలాంటిదేమీ లేదని అధికారులు కొట్టిపారేస్తున్నారు. ఈ ఘటనను పరిశీలించిన అధికారులతోపాటు విద్యుత్‌శాఖ నిపుణులు సైతం సందేహాలు వ్యక్తం చేయడం గమనార్హం. దీనిపై మరింత లోతుగా విచారణ చేపట్టడానికి కలెక్టర్ చర్యలు ఆరంభించినట్లుగా సమాచారం. ఇక.. కలెక్టరేట్‌లోని పలు కార్యాలయాల్లో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. స్విచ్‌బోర్డులు పగిలిపోయి, వైర్లు తేలి కనిపిస్తున్నాయి. అగ్నిప్రమాదం జరిగిన తరువాత కూడా మరమ్మతులు, రక్షణ చర్యలు తీసుకున్న దాకలాలు కనిపించడంలేదు.

పార్కింగ్‌కు అడ్డా

పట్టణంలో మధ్యలో ఉన్న విశాలమైన కలెక్టరేట్ ఆవరణ వాహనాల పార్కింగ్ అడ్డాగా మారింది. అధికారులు, ఉద్యోగులు, సందర్శకుల వాహనాలు, సైకిల్‌మోటార్లు సాయంత్రం 5 గంటల వరకే ఉంటాయి. కానీ రాత్రివేళలోనూ వాహనాలను కలెక్టరేట్‌లోనే పార్కింగ్ చేస్తున్నారు. జిల్లాకేంద్రానికి వివిధ పనుల కోసం వచ్చే వారు తమ వాహనాలను కలెక్టరేట్‌లోని

మిగతా 8వ పేజీలో..



వెస్లీ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

వైజ్ఞానిక ప్రదర్శనకు వేళాయే..

మెదక్ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వెస్లీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు ఏడు అంశాల్లో ఎగ్జిబిట్లు ప్రదర్శించనున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. బుధవారం ఆయన జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో నీలకంఠంతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

మళ్లీ రంగంలోకి హైడ్రా!

- ఫిర్యాదుల నేపథ్యంలో చెరువుల పరిశీలన
- గ్రేటర్‌తోపాటు శివార్లలోని చెరువుల సందర్శన
- ఆక్రమణలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చిన స్థానికులు
- షెడ్ల తొలగింపునకు రంగనాథ్ ఆదేశం
- చెరువులను కబ్జా చేస్తే విడిచిపెట్టబోమని హెచ్చరిక

7



మేళ్ల చెరువును పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

నాణ్యమైన ఆహారం అందించాలి

- సరుకులు, కూరగాయల నాణ్యతపై రాజీ పడొద్దు
- వంట పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- రామాయంపేట బాలికల గురుకులంలో ఆకస్మిక తనిఖీ
- సమస్యలపై ఆరా



రామాయంపేట బాలికల గురుకులంలో కూరగాయలు పరిశీలిస్తున్న కలెక్టర్

రామాయంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు పరిశుభ్రమైన పౌష్టికాహారం అందజేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. రామాయంపేటలోని బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి భోజనం బాగుంటున్నదా? వసతులు ఉన్నాయా? అని తెలుసుకున్నారు. అనంతరం కూరగాయలు, సరుకులు ఉంచే స్టోర్‌రూంను, వంటశాలను పరిశీలించారు. వడ్డించడానికి సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూరగాయలు, సరుకుల నాణ్యతపై రాజీపడొద్దని సూచించారు. మెనూ ప్రకారం పరిశుభ్రమైన ఆహారాన్ని అందజేయాలని ఆదేశించారు. వంట పాత్రలు, కిచెన్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో భోజనం, వసతులపై నిఘా ఉంచుతున్నామని తెలిపారు. ఎక్కడైనా సమస్యలున్నా, నిర్లక్ష్యంగా ఉన్నట్టు గుర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాళ్లకల్‌లో తూతూమంత్రంగా సమగ్ర కుటుంబ సర్వే

మనోహరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే తుదిదశకు చేరుకున్నా కొన్నిచోట్ల మాత్రం తమ ఇంటికి సర్వే సిబ్బంది రానేలేదని ప్రజలు వాపోతున్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కేంద్రంలో సర్వేను నాలుగు రోజుల క్రితమే ముగించి డేటా ఎంట్రీ చేపడుతున్నారు. కానీ, తమ ఇళ్లకు సర్వే సిబ్బంది రాలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామంలో 1,500 కుటుంబాలు ఉన్నట్టు లెక్కతేల్చిన అధికారులు ప్రతీ ఇంటికి స్టిక్కరింగ్ చేశారు. 10 మంది ఎన్యూమరేటర్లు 150 కుటుంబల చొప్పున వివరాలు సేకరించారు. కానీ గ్రామంలో 30 కుటుంబల వరకు తమ ఇళ్లకు సర్వే సిబ్బంది రానేలేదని ఆరోపిస్తున్నారు. తమ ఇంటికి సర్వే సిబ్బంది రానేలేదని జాతీయరహదారి పక్కన ఉన్న జనతాహోటల్ నిర్వాహకుడు గుండు లక్ష్మణ్‌కూమార్ ఆరోపించారు. తాము 24 గంటలు అందుబాటులోనే ఉంటామని, సర్వే కోసం ఎవరూ రాలేదని పేర్కొన్నారు. గ్రామంలో నివసించే ఎరుకలి నర్సింహులు మాట్లాడుతూ తమ ఇంటి చుట్టూ సర్వే చేసినా తమ వద్దకు ఎవరూ రాలేదని ఆరోపించారు. దీంతోపాటు పలు కాలనీల్లోనూ ఎన్యూమరేటర్లు రాలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మనోహరాబాద్ ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా సర్వే పూర్తయ్యిందని, ఎవరైనా మిగిలిపోతే తమ వద్దకు వస్తే నమోదు చేస్తామని పేర్కొన్నారు.



కల్వర్టును ఢీకొట్టి నుజ్జయిన కారు

కల్వర్టును ఢీకొన్న కారు

తండ్రీకొడుకులు దుర్మరణం.. మరో నలుగురికి గాయాలు





రాజశేఖర్

అల్లాదుర్గం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడుకును చూసేందుకు వెళ్లి తిరిగి వస్తున్న తండ్రీకొడుకులను మృత్యువు కబళించింది. మెదక్ జిల్లా అల్లాదుర్గం వద్ద గల 161వ జాతీయ రహదారిపై బుధవారం వారు ప్రయాణిస్తున్న కారు వేగంగా కల్వర్టును ఢీకొనడంతో ఇద్దరు మృత్యువాతపడగా నలుగురికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన చంద్రశేఖర్ దేశ్‌ముఖ్ సంగారెడ్డిలో అనాటమీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అతనిని కలిసేందుకు తండ్రి శివరాజ్ దేశ్‌ముఖ్(78), తల్లి లక్ష్మీబాయి, రెండో కుమారుడు రాజశేఖర్ దేశ్‌ముఖ్, చిన్నకోడలు అరుణ కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. బుధవారం తిరిగి బోధన్‌కు కారులో వెళ్తుండగా అల్లాదుర్గం వద్ద 161 జాతీయ రహదారిపై అదుపు తప్పి కల్వర్టును ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడినవారిని హైవే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ రాజశేఖర్ మృతి చెందాడు. శివరాజ్ దేశ్‌ముఖ్‌ను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ ఆయన చనిపోయారు. ప్రమాదంలో గాయపడిన లక్ష్మీబాయి, అరుణ, మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జోగిపేట ఆస్పత్రికి వచ్చి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సింగూరు ప్రాజెక్టు, అందోలు చెరువులను

పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి

సుందరీకరణకు అవసరమైన డిజైన్లు, అంచనాలు రూపొందించండి

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర్

జోగిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అతిపెద్ద ప్రాజెక్టు అయిన సింగూరు ప్రాజెక్టుతో పాటు అందోలు-జోగిపేటలోని రంగనాయకసాగర్ చెరువులను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు అసవరమైన చర్యలు చేపట్టాలని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యాటకశాఖ అధికారులను ఆదేశించారు. సింగూరు సుందరీకరణపై బుధవారం ఆయన హైదరాబాద్‌ని జలసౌధలో పర్యాటకశాఖ ఇంజనీర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగూరు ప్రాజెక్టులో బోటింగ్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. ప్రాజెక్టు మధ్యలో ఉన్న ద్వీపాన్ని పర్యాటక ప్రదేశంగా మార్చాలని, డ్యాం ముందు గల పార్కును స్కల్ప్చర్ పార్కుగా అభివృద్ధి పరిచి ఆహ్లాదదకరంగా మార్చాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని అతిపెద్ద చెరువు అయిన రంగనాయకసాగర్‌ను కూడా సుందరీకరించి బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, చెరువు కట్టను సుందరీకరించాలని మంత్రి ఆదేశించారు. ఈ పనులకు డీపీఆర్‌ను సిద్ధం చేయాలని నిర్దేశించారు..సమీక్షలో పర్యాటకశాఖ డిప్యూటీ ఈఈ నటరాజ్, ఆర్కిటెక్ట్ విజయ్, సీవిల్ ఇంజనీర్ వినిత్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ పనులపై మంత్రుల సమీక్ష

అందోలు, నారాయణఖేడ్ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదలశాఖ పనులపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న, కొనసాగుతున్న పపనులు, కొత్తగా చేపట్టాల్సిన ప్రాజెక్టులపై దిశానిర్దేశం చేశారు. సమీక్షలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో వృద్ధుడికి ఐదేళ్ల జైలు

రామచంద్రాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో వృద్ధుడికి ఐదేళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ సంగారెడ్డి అదనపు జడ్జి కే.జయంతి బుధవారం తీర్పు వెలువరించినట్లు రామచంద్రాపురం సీఐ జగన్నాథ్ తెలిపారు. బండలగూడకు చెందిన ఆచారి రాజు(60) కూలీగా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన బాలిక(5)పై గతేడాది లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయగా.. ఎస్ఐ వెంకటేష్ దర్యాప్తు చేశారు. కేసులో ఆధారాలు సమర్పించిన ఎస్ఐని, కోర్టు కానిస్టేబుల్ కాశీని సీఐ అభినందించారు.

కార్తీక దీపాలు వెలిగించడం మహా పుణ్యఫలం

- రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామిజీ
- నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక దీపోత్సవం



కార్తీక దీపోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మాధవానంద స్వామిజీ

వర్గల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో కార్తీకదీపాలు వెలిగించడం ఎంతో పుణ్యఫలమని మెదక్ రంగంపేట పీఠాధిపతులు మాధవానంద సరస్వతీ స్వామిజీ అన్నారు. బుధవారం వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక దీపోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. కార్తీకమాసం శివుడికి ఎంతో ప్రాధాన్యతమైన మాసమన్నారు. ప్రతి నిత్యం దీపారాధన చేయడం వల్ల మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ, ఆలయ అర్చకులు, అధికారులు సుధాకర్, పాండు, నరేందర్ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల టీచర్లు, సిబ్బంది నిరసన

నర్సాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీచర్లు, సిబ్బంది యూటీఎఫ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో చిప్పల్‌తుర్తి పాఠశాల ప్రాంగణంలో బుధవారం నిరసన చేపట్టారు.

'భట్టి'ని కలిసిన పంచాయతీ కార్యదర్శులు



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కంది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎంఎస్ఎస్.వాణి బుధవారం కలిశారు. ఉమ్మడి మెదక్ జిల్లా పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ 1, 2 పదోన్నతులు కల్పించాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి న్యాయం చేస్తానని హామీఇచ్చినట్టు వాణి తెలిపారు.

డీఆర్వోగా భుజంగరావు బాధ్యతల స్వీకరణ

మెదక్ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నూతన డీఆర్వోగా భుజంగరావు బాధ్యతలను స్వీకరించారు. నిర్మల్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై మెదక్ జిల్లాకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఆర్వో పద్మశ్రీ ఐదునెలలుగా దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. కాగా భుజంగరావు కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డీఆర్వోకు అదనపు కలెక్టర్ మెంచు నగేష్, మెదక్, నర్సాపూర్ ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ఉరేసుకుని ఇద్దరి మృతి

దౌల్తాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల ఇద్దరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దౌల్తాబాద్ మండల పరిధి సూరంపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన భీముగారి లచ్చయ్య, సువర్ణ దంపతులు. వీరికి ముగ్గురు కూతుళ్లు. లచ్చయ్యకు ఉన్న కొద్ది భూమి అమ్మి కూతుళ్ల వివాహం చేశాడు. రెండో కూతురు రజితకు హెచ్‌ఐవీ సోకడంతో భర్తతో విడాకులు తీసుకుని తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. లచ్చయ్యకు కుష్ఠు ఉండడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో లచ్చయ్య, సువర్ణకు ప్రతిరోజూ గొడవ జరుగుతోంది. దీంతో మనస్తాపం చెందిన లచ్చయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మరో ఘటనలో..

సూరంపల్లి గ్రామానికి చెందిన వడ్డే స్వామికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మహేందర్(20) గజ్వేల్‌లోని ఓ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవలే మహేందర్ వాళ్ల మేనమామ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లారు. కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేందర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మహేష్ మృతదేహం

జిన్నారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం కొడకంచి గ్రామానికి చెందిన కంచనపల్లి మహేష్(30) మంగళవారం రాత్రి 9 గంటలకు ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆరాతీసినా ఆచూకీ లభించలేదు. కాగా బుధవారం తెల్లవారుజామున గ్రామ శివారులోని ప్రధాన రహదారి పక్కన మహేష్ శవమై కనిపించడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మహేష్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబీకులు జిన్నారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కూతురును చంపిన వ్యక్తికి జీవిత ఖైదు

టేక్మాల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కూతురును కిరాతకంగా చంపిన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పీ.లక్ష్మీశారద మంగళవారం తీర్పునిచ్చారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం పల్వంచ గ్రామానికి చెందిన బుర్ర రమణయ్య 2021లో కూతురు శివాని(3) గొంతు నులిమి హత్యచేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన అప్పటి సీఐ జార్జ్ విచారణ చేసి కోర్టుకు ఆధారాలు సమర్పించారు. నిందితుడు రెండో వివాహం చేసుకోగా.. అప్పటికే ఆమెకు కూతురు ఉన్నది. తనకు పుట్టలేదనే అనుమానంతో హతమార్చాడు. భార్య గర్భవతిగా ఉండడంతో తనకు పుట్టబోయే బిడ్డ తన వారసత్వానికి ఇబ్బంది కలుగుతుందని హత్య చేసినట్లు సాక్ష్యాధారాలు పరిశీలించిన కోర్టు నిందితుడు ఉద్దేశపూర్వకంగా హత్య చేసినట్లు ధ్రువీకరించి జీవిత ఖైదు విధించింది.


కోహీర్‌లో సాగుచేస్తున్న జామ పంట



కోరి మరీ కొంటారు.. కోహీర్ జాంపండు..

● రుచిలో 'కోహినూర్' ● పేరుగాంచిన 'సఫేదా' రకం ● 350 ఎకరాల్లో తోటల సాగు

కోహీర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ అనగానే ముందుగా గుర్తుకొచ్చేది తియ్యని సఫేదా రకం జామ పండు. కోహినూరు వజ్రానికి ఎంత పేరుందో... కోహీర్ జామ పండుకు అంతే పేరుందని చెబుతారు. కోహీర్ సఫేద జామ అంటే తెలియనివారు ఉండరు. కోహీర్ జామకు.. కోహీర్‌కు రెండు శతాబ్దాల అనుబంధం ఉంది. మండలంలో దాదాపు 350 ఎకరాల్లో సాగవుతోంది. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన సఫేదా రకం జామ అలహాబాద్ సఫేదా, కోహీర్ సఫేదా రెండు రకాల్లోనే దొరుకుతుంది. ఇలాంటి జామ తోటలు కోహీర్‌లో ఉండడం గమనార్హం. ఈ జామపండు తెలుపు రంగులో మెరిసిపోతుంది. గింజలు తక్కువ.. గుజ్జు ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతంలోని వారు ఎక్కడికి వెళ్లినా జామ మొక్కనే బహుమతిగా ఇస్తారు. లేదా పండ్లను తీసుకెళ్లి అందజేయడం ఆనవాయితీ అని ఈ ప్రాంతం వారు చెబుతున్నారు.

ప్రత్యేక గుర్తింపు

సఫేదా జామపండు సాగువల్ల కోహీర్‌కు జాతీయ స్థాయిలో పేరొచ్చింది. దేశంలో సఫేదా రకం జామలో అలహాబాద్ సఫేదా, కోహీర్ సఫేదా మాత్రమే ప్రత్యేకం. అయితే కోహీర్‌లో జామ సాగు ఎప్పుడు ప్రారంభమైంది. ఎక్కడి నుంచి వచ్చిందనే ప్రశ్నలకు సమాధానం లేదు. ఈ ప్రాంతంలోని నేలలు ఇసుకతో కూడిన ఎర్రమట్టితో ఉండడం జామపంట సాగుకు అనువైంది. ఇతర నేలల్లో కంటే ఎర్రనేలల్లో పండిన జామపండ్లు రుచికరంగా ఉంటాయి. తెలుపు వర్ణంలో ఉంటూ పండుపై అక్కడక్కడ ఎర్రని మచ్చలు ఉంటాయి.

లాల్ బహుదూర్ శాస్త్రికి బహుమతిగా జామ మొక్క

50వ దశకంలో మొదటి రైల్వేశాఖ మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి కోహీర్ మీదుగా రైలులో వెళ్తుండగా.. స్వాతంత్ర్య సమరయోధులు ఆయనను కలుసుకునేందుకు వెళ్లి కోహీర్ జామ మొక్కను బహుమతిగా ఇచ్చారు. చౌకగా లభించే జామకాయ లేదా పండులో పోషకాలు చాలానే ఉంటాయి. ముఖ్యంగా దీనిలో క్యాలరీలు తక్కువగా ఉండి పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. నీటిలో కరిగే బీ, సీ విటమిన్లు, కొవ్వులో కరిగే విటమిన్ ఏ జామకాయలో ముఖ్యంగా లభించే పోషకాలు. ఇక జామపండుపై చర్మంలో విటమిన్ సీ అత్యధికంగా ఉంటుంది.

జామతో లాభాలు

జామ పండులో ఉండే పీచు పదార్థం వల్ల మలబద్ధకం నివారించబడుతుంది. పీచు పదార్థం వల్ల డయాబెటిస్ రోగులకు సంజీవనిలా ఉపయోగపడుతుంది. బొప్పాయి, ఆపిల్, నేరేడుపండు కంటే జామపండులోనే పీచు పదార్థం ఎక్కువగా ఉండడంతో షుగర్ వ్యాధికి చక్కటి ఔషధమని చెబుతారు. జామ ఆకులను నమలడం వల్ల పంటి నొప్పులు తగ్గడమే కాక.. ఆకలి కూడా పెరుగుతుంది. పైగా కొన్నిరకాల వ్యాధుల బారినపడి ఆకలి మందగించిపోయిన వారికి ఇది ఆకలి పుట్టించగలదు. జామపండు కంటే జామకాయను తినడం శ్రేష్ఠం. కాయ గట్టిగా, ఆకుపచ్చ రంగులో, దోరగా ఉన్నప్పుడే తినేస్తే దాని పూర్తి గుణం శరీరానికి అందుతుంది. పేదల యాపిల్ జామలో అధిక పోషకాలు, ఔషధ గుణాలు ఉంటాయి.

జామ సాగుపై ఆసక్తి

కోహీర్, బిలాల్‌పూర్, దిగ్వాల్, ఖానాపూర్, గుర్జువాడ, మాచిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో గతంలో వేలాది ఎకరాల్లో జామ సాగయ్యేది. అయితే 20 ఏళ్ల క్రితం పండ్లకు కుళ్లు, తెగుళ్లు సోకడంతో జామ రైతులు విపరీతంగా నష్టపోయారు. దీంతో వందలాది ఎకరాల్లో జామ తోటలు రైతులు నరికివేశారు. ప్రస్తుతం పరిస్థితిలో మార్పు వచ్చింది. రైతులు మళ్లీ జామపంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మండలంలో 350 ఎకరాల్లో సాగవుతోంది. సుమారు 200 కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నాయి.

మార్కెట్ సదుపాయం కరువు

జామచెట్లు ఏడాదికి రెండుసార్లు కాత కాస్తాయి. మే, జూన్‌లో ఒక్కసారి... నవంబరు, డిసెంబరు, జనవరిలో పండ్లు కోతకు వస్తాయి. ప్రధానంగా నవంబరు, డిసెంబరు, జనవరిలోనే కాత అధికంగా ఉంటుంది. ఇక్కడి పండ్లను హైదరాబాద్‌తో పాటు తాండూరు, కర్నాటకలోని బీదర్, గుల్బర్గా తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. స్థానిక అమ్మకాలు తోడు రోజూ సుమారు మూడు టన్నుల జామపండ్లను ఎగుమతి చేస్తున్నారు. స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో పాటు రవాణా సౌకర్యం లేక రైతులు వ్యాపారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.


కవేలి చౌరస్తా 65వ జాతీయ రహదారి పక్కన జామపండ్ల విక్రయం

మళ్లీ రంగంలోకి హైడ్రా..!

- ఫిర్యాదుల నేపథ్యంలో చెరువుల పరిశీలన
- ఆక్రమణలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చిన స్థానికులు
- షెడ్ల తొలగింపునకు రంగనాథ్ ఆదేశం

హైదరాబాద్ సిటీ/రామచంద్రాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా మరోసారి రంగంలోకి దిగింది. గ్రేటర్‌తోపాటు శివారు ప్రాంతాల్లోని పలు చెరువులను కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. నివాసేతర ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, వెంటనే తొలగించాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి మాదాపూర్‌లోని ఖానామెట్ సర్వే నెంబర్ 7లో 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈదులకుంటను ఓ రియల్ ఎస్టేట్ సంస్థ మట్టితో పూడుస్తుందన్న ఫిర్యాదుతో అక్కడకు వెళ్లిన రంగనాథ్.. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి ఈదుల కుంటను పరిశీలిస్తానని, నిర్మాణదారుల వద్ద ఉన్న డాక్యుమెంట్లు, సర్వే నివేదికను పరిశీలిస్తానన్నారు. మాదాపూర్‌లోని మేడికుంటను కూడా ఆయన పరిశీలించారు. మెజార్టీ కుంట మాయమై ఇప్పటికే అక్కడ బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి.

చెరువులు కబ్జా కాకుండా నియంత్రిస్తాం

నిజాంపేటలోని తలాబ్ (తురక లేక్) చెరువు ఆక్రమణల వివరాలను స్థానికులు కమిషనర్ రంగనాథ్‌కు వివరించారు. చెరువుకు సంబంధించిన మ్యాపులు, డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు. ఇదే చెరువు వద్ద నిజాంత ల్యాబ్‌ను కూడా పరిశీలించారు. కట్టకు ఆనుకుని ఉన్న షెడ్లను రెండు రోజుల్లో తొలగించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కట్టపైకి వెళ్లిన కమిషనర్ చెరువులోకి ఇన్‌లెట్ ద్వారా వస్తోన్న మురుగునీటిని చూసి చెరువంతా కలుషితమవుతుందని, మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో చెరువుకు సంబంధించి సమగ్ర సర్వే చేయాలన్నారు. బండారి లే అవుట్ కమ్యూనిటీ అసోసియేషన్ సభ్యుల కోరిక మేరకు చెరువును పూర్తిస్థాయిలో పరిశీలించారు. నార్సింగ్‌లోని నెక్నాంపూర్ చిన్న చెరువును పరిశీలించిన ఆయన బఫర్ జోన్‌లో నిర్మాణాల వివరాలు తెలుసుకున్నారు. గేటెడ్ కమ్యూనిటీలోని మురుగు నీరు నేరుగా వచ్చి చెరువులో చేరుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. తెల్లాపూర్‌లోని వనం, చెల్లికుంట, మేళ్ల చెరువులను ఆయన పరిశీలించారు. సుందరీకరణ పేరిట రియల్ కంపెనీలు కబ్జా చేస్తున్నాయని, చెరువులను పునరుద్ధరించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. ఇక నుంచి చెరువులు కబ్జా కాకుండా నియంత్రిస్తామని, పునరుద్ధరణకూ అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు, క్షేత్రస్థాయిలో పరిస్థితులు, డాక్యుమెంట్లు, సర్వే నివేదికలను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలుంటాయని స్థానికులతో కమిషనర్ పేర్కొన్నారు.

చెరువుల సమగ్ర విచారణకు త్వరలో వస్తా

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని తెల్లాపూర్ మేళ్లచెరువును కూడా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. మేళ్ల చెరువు కట్టపై నుంచి ఏలియన్స్ నెవీ గార్డెన్, సంకల్ప, ఇండస్‌క్రస్ట్, ఎన్‌సీసీ క్లబ్ హౌస్‌లు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయని అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కొల్లూరు పెద్ద చెరువులోకి వెళ్లే వరద కాలువను ఓ బిల్డర్ పూడ్చి వేశారన్నారు. కొల్లూరు నుంచి మేళ్ల చెరువులోకి వచ్చే వరద కాలువను 177 సర్వేనంబరులో పూడ్చి వేసి పట్టాదారు తన భూమిలో కలుపుకున్నారని, ఈ వరద కాలువ కోసం ప్రభుత్వం 1.6 ఎకరాల భూమిని విడిచిపెట్టిందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ చెరువుల సమగ్ర విచారణకు త్వరలో మళ్లీ వస్తానని, అధికారులు అన్ని రికార్డులతో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. చెరువులను కబ్జా చేశారని నిర్ధారణ అయితే ఎవరిని విడిచిపెట్టేది లేదన్నారు.

వీడిన తల్లీకొడుకుల ఆత్మహత్య మిస్టరీ

● దొంగతనాలు బయటపడ్డాయని మనస్తాపంతో..



వడ్ల శ్యామ్(ఫైల్), బాలమణి(ఫైల్)

జోగిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన తల్లీ కొడుకుల ఆత్మహత్య మిస్టరీ వీడింది. అందోలు మండలం చింతకుంటకు చెందిన వడ్ల శ్యామ్ తొలుత చేసిన దొంగతనం నుంచి బయటపడేందుకు మరో దొంగతనం చేశాడు. తీరా పట్టుబడ్డాక తట్టుకోలేక ఆత్మహత్య చేసుకునేందుకు మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని మంజీరా నదిలోకి దూకాడు. తల్లి బాలమణి కూడా వెంటనే దూకింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన శ్యామ్ ఇంటి వెనుక ఉన్న చాంద్‌పాషా ఇంటికి బంధువులు ఐదురోజుల క్రితం టాటా ఏస్‌లో వచ్చి రాత్రి అక్కడే బసచేశారు. అయితే శ్యామ్ సదరు టాటా ఏస్‌ను అదేరాత్రి దొంగిలించి.. నర్సాపూర్ వైపు వెళ్తుండగా.. కొల్చారం మండలం బుజరంపేట వద్ద పాడై ఆగిపోయింది. అనంతరం దానిని తీసే క్రమంలో విపరీతమైన శబ్దం రావడంతో గ్రామస్థులు లేచి దొంగ, దొంగ అని అరిచారు. దీంతో భయపడ్డ శ్యామ్.. అక్కడే పార్క్ చేసి ఉన్న బైక్‌ను దొంగిలించి చింతకుంటకు పారిపోయాడు. దుంపలకుంట వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరా ఫుటేజీల్లో శ్యామ్‌ను గుర్తించడంతో బుజరంపేట గ్రామస్థులు చింతకుంటకు వచ్చారు. తమ బైక్‌ను ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో చాంద్‌పాషా కూడా తమ బంధువుల టాటాఏస్‌ను ఇవ్వాలన్నాడు. ఈ విషయమై బుజరంపేట గ్రామస్థులు శ్యామ్‌ను, అతడి తల్లిదండ్రిని బుజరంపేటకు పంచాయితీకి పిలిచారు. శ్యామ్(27), తల్లి బాలమణి(48)తో కలిసి బైక్‌పై, తండ్రి యాదయ్య బస్సులో బయలుదేరాడు. సమీపంలోని మంజీరా నదిపై గల బ్రిడ్జి వద్దకు రాగానే శ్యామ్ బైక్‌ను ఆపాడు. తల్లి బాలమణిని దింపి ఒక్కసారిగా నదిలోకి దూకాడు. ఆ వెంటనే తల్లి కూడా దూకింది. అటుగా వెళ్తున్న ఇతర వాహనదారులు చూసి వాట్సాప్‌లో సదరు బైక్ ఫొటో పెట్టారు. మృతుడి తండ్రి యాదయ్య విషయం తెలుసుకుని పోలీసులకు, బంధువులకు సమాచారమందించాడు. రాత్రి కావడంతో గాలింపు సాధ్యం కాలేదు. దీంతో బుధవారం ఉదయం పోలీసులు గాలింపు చేపట్టి ఇద్దరి మృతదేహాలను బయటకుతీశారు. పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లందరూ క్రమశిక్షణతో ఉండాలి: రమేష్

సంగారెడ్డి క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌జెండర్లందరూ క్రమశిక్షణతో ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ సూచించారు. సంగారెడ్డిలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవ్యవస్థలో ఎలా ఉండాలో చెప్పారు. వారికున్న హక్కుల గురించి వివరించారు. లింగ మార్పిడి వ్యక్తి సంరక్షణ, న్యాయపరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

చెడు వ్యసనాలకు బానిసై గంజాయి అమ్మకం

● పదికిలోల గంజాయి, ఫోన్లు స్వాధీనం, ఇద్దరు నిందితుల అరెస్ట్


గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని గజ్వేల్, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ పురుషోత్తంరెడ్డి వివరాలను వెల్లడించారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన అరికెల శేఖర్(23), అదే గ్రామానికి చెందిన బోయిన నరేశ్(23) మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మల్లబోయినపల్లి గ్రామానికి చెందిన సుక్కసారి భానుప్రసాద్(21) ప్రస్తుతం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసినగండ్లలో నివాసముంటున్నాడు. వీరు ముగ్గురు చెడు అలవాట్లకు బానిసై, ఈజీ మనీ కోసం గంజాయిని వ్యాపారంగా చేసుకున్నారు. ఈ క్రమంలో భద్రాచలం జిల్లా సీలేరుకు చెందిన వర్ధన్ వద్ద గంజాయిని కొనుగోలు చేస్తూ వ్యాపారాన్ని చేస్తున్నారు. వారంరోజుల క్రితం శేఖర్, నరేశ్ గంజాయి తీసుకురావడానికి వెళ్తున్నామని చెప్పి భానుప్రసాద్‌కు ఫోన్‌చేయగా తాను రానని, గంజాయి కావాలని రూ.7 వేలు శేఖర్‌కు ఫోన్‌పే చేశాడు. నరేశ్ స్నేహితుడు చింటు బైక్‌పై అరికెల శేఖర్, బోయిని నరేశ్ ఇద్దరూ సీలేరుకు వెళ్లి వర్ధన్‌కు రూ.38 వేలు ఇచ్చి 20 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. బైక్‌పై వస్తే పోలీసులు పట్టుకుంటారని బ్యాగులో పెట్టుకుని హైదరాబాద్ వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి అహ్మదీపూర్‌కు చేరుకుని గ్రామ శివారులోని మల్లన్నసాగర్ కట్ట వద్ద దాచిపెట్టారు. గంజాయి కావాలని భానుప్రసాద్ అడగ్గా.. అందులోంచి శేఖర్ రెండు కిలోలు తీసి ఇచ్చాడు. ఈ క్రమంలో పోలీసులు చాకచక్యంగా వారిని పట్టుకుని విచారణ చేపట్టారు. వారి నుంచి పది కిలోల గంజాయిని, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. బోయిన నరేశ్, వర్ధన్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. కాగా ఈ ముగ్గురిపై గతంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదవగా, సదరు కేసులో బెయిల్‌పై విడుదలై వచ్చారని ఏసీపీ తెలిపారు. చాకచక్యంగా గంజాయిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, ఇన్‌స్పెక్టర్లు జానకీరాంరెడ్డి, గజ్వేల్ సీఐ సైదా, ముత్యంరాజు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అభినందించారు. త్వరలోనే రివార్డును అందజేస్తామని తెలిపారు.

68 ఏళ్ల సేవలకు ఇక సెలవు

● గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్ వరకు సేవలందించిన భవనం ● నేడు మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభం


నూతన మున్సిపల్ కార్యాలయ భవనం

హుస్నాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ ఆటుపోట్లకు, అభివృద్ధికి ప్రణాళికలు చేసిన భవనం.. ఇక్కడ ప్రథమ పౌరునిగా పనిచేసిన నేతలను ఉన్నత పదవులు అందించిన పంచాయతీ కార్యాలయం.. నాటి గ్రామపంచాయతీ నేటి పురపాలక సంఘం వరకు 68 ఏళ్ల సేవలందించి ఇక సెలవంటుంది. గురువారం హుస్నాబాద్ మున్సిపల్ అన్ని హంగులతో నిర్మించిన నూతన కార్యాలయం ప్రారంభం అవుతున్న సందర్భంగా పాత కార్యాలయ భవనం చరిత్రగా మిలిగిపోనుంది.

1951లో హుస్నాబాద్ మైనర్ గ్రామపంచాయతీ. 3 వేల ఓటర్లు కూడా లేని గ్రామం. అంచలంచెలుగా మేజర్ గ్రామపంచాయతీగా ఎదిగింది. అపై పట్టణ రూపురేఖలు సంతరించుకొని 8 సెప్టెంబరు 2011లో నగరపంచాయతీగా మారింది. 24 మార్చి 2018న మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. 1951లో మొదటి సర్పంచ్‌గా మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు వియ్యంకుడైన బొప్పరాజు లక్ష్మీకాంతారావు ఎన్నికయ్యారు. మొదటి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఇంట్లోనే నిర్వహించారు. 1956లో హుస్నాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో గ్రామపంచాయతీ కార్యాలయంగా పెంకుటింటిని నిర్మాణం చేశారు. అప్పటి నుంచి పట్టణ అభివృద్ధికి అనుగుణంగా ఇంటిని కూల్చివేసి దీని స్థానంలో భవనం నిర్మించారు. ఇందులో సర్పంచ్‌గా పనిచేసిన నేతలకు రాజకీయ భవిష్యత్తు అందించింది. సర్పంచ్‌గా పనిచేసిన లక్ష్మీకాంతారావు హుస్నాబాద్ బ్లాక్ ప్రెసిడెంట్‌గా, 1962లో ఇందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు ఇక్కడ సర్పంచులు, వార్డు సభ్యులుగా పనిచేసిన పలువురు నాయకులు ఉన్నత పదవులు పొందారు. నాటి గ్రామపంచాయతీ నుంచి నేటి మున్సిపల్ కార్యాలయం వరకు 68 ఏళ్ల సేవలందించిన ఈ భవనం హుస్నాబాద్ పట్టణానికి చరిత్రగా నిలువబోతుంది.



నగర పంచాయతీ కార్యాలయ భవనం(ఫైల్)

రూ. 5 కోట్లతో మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం

హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన మున్సిపల్ కార్యాలయ నూతన భవనాన్ని గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. 10 ఏళ్ల క్రితం అప్పటి నగర పంచాయతీ కార్యాలయ నిర్మాణం కోసం రూ.50 లక్షల మంజూరైనా స్థల సేకరణ, నిధుల లేమి వంటి పలు సమస్యలతో పనులు జరుగలేదు. అనంతరం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మాణాన్ని చేపట్టారు. తదుపరి రూ. 2.50 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టగా గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లలో అధునాతనంగా నిర్మించడంతో దీని వ్యయం రూ.5 కోట్లకు చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న దీని నిర్మాణానికి ఆహర్నిశలు కృషి చేయడం వల్లనే ప్రస్తుతం ప్రారంభానికి నోచుకుంటుందని పలువురు ఆమెను అభినందిస్తున్నారు.

ప్రజారోగ్య కరదీపిక ఆవిష్కరణ

సంగారెడ్డి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమంపై ప్రాథమిక ఆరోగ్య, వైద్య అధికారులకు సంబంధించిన కరదీపికను సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజారోగ్య కరదీపికలో జాతీయ ఆరోగ్య మిషన్, జనని సురక్ష యోజన, పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సేవలు, పౌష్టికాహారంలాంటి అంశాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు, కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డా. గాయత్రిదేవి, డా. శశాంక్, డిఐవో ప్రసాద్ డెఓ, రవి, శశి, తదితరులు పాల్గొన్నారు.

'చౌటకూర్ డిస్టిలరీ పరిశ్రమపై చర్యలు తీసుకోండి'

పుల్‌కల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చౌటకూర్ సమీపంలోని ఈఎంపీఈఈ డిస్టిలరీ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు అనిల్, ఎన్.గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డిలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయానికి వెళ్లి అధికారి గీత సఫారికి ఫిర్యాదు చేశారు. పరిశ్రమ వెదజల్లుతున్న కాలుష్యంతో చౌటకూర్, సరాఫ్‌పల్లి, సుల్తాన్‌పూర్, ఉప్పరిగూడెం, శేరిరాంరెడ్డిగూడెం, బద్రిగూడెం తదితర గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. రాత్రివేళలో దట్టమైన పొగ వ్యాపించడంతో అలర్జీ, దగ్గు, దమ్ము, ఆయాసం, ఉబ్బసం బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఈఎంపీఈఈ డిస్టిలరీ పరిశ్రమ యాజమాన్యం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

మెదక్ అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో అండర్-14 బాలబాలికలకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. బుధవారం ముగింపు కార్యాక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ హాజరై ప్రతిభ కనబరిచినవారికి బహుమతులు అందజేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నర్సాపూర్ గురుకుల విద్యార్థులు

నర్సాపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సాఫ్ట్‌బాల్ పోటీలకు నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు 8మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాసాయిపేటలో నిర్వహించిన డిస్టిక్ లెవల్ సెలక్షన్‌లో నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. డిసెంబరులో నిర్మల్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య

సంగారెడ్డి అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మర్పల్లి లక్ష్మయ్యయాదవ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మయ్యయాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

వెల్‌నెస్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని 32వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ సీతారామ శివాంజనేయ స్వామి ఆలయం వద్ద వెల్‌నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. రోగులకు ఈసీజీ, షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మందికిపైగా రోగులు డా.హుజమా ఆధ్వర్యంలో వైద్య సేవలు పొందారు.

వడ్డెర సంక్షేమ సంఘ సమావేశానికి ఆహ్వానం

మెదక్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం చైతన్య సమావేశానికి హాజరు కావాలని రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జర్పటి జైపాల్‌ను తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు ఎత్తరి మారయ్య ఆహ్వానించారు. ఆయనతో మెదక్ జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు దండుగుల దుర్గా సాయిలు తదితరులు ఉన్నారు.

పార్కు స్థలానికి రక్షణ కరువు




బొల్లారం మున్సిపాలిటీ ఎన్‌రిచ్ పారిశ్రామిక వాడలో ఫెన్సింగ్ తొలగించిన చోట వాహనాల పార్కింగ్, వెనుక భాగం నుంచి ఏర్పాటు చేసుకున్న రహదారి

- బొల్లారంలో సుమారు రూ.3 కోట్ల విలువైన పార్క్ స్థలం రక్షణ గాలికి
- ఫెన్సింగ్ తొలగించి దర్జాగా ప్రైవేట్ వాహనాల పార్కింగ్
- చెత్త డంపింగ్ కూడా అక్కడే

జిన్నారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో విలువైన పార్క్ స్థలానికి రక్షణ కరువైంది. మున్సిపాలిటీ పరిధి 2వ వార్డులో గల ఎన్‌రిచ్ పారిశ్రామిక వాడ పార్క్ స్థలంలో ఫెన్సింగ్ తొలగించిన చోట ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేస్తుండగా, ఇక్కడే చెత్తను సైతం పారవేస్తున్నారు. సుమారు 500 గజాల పార్క్ స్థలంలో గతంలో ఉన్న చెట్లు కూడా కనుమరుగయ్యాయి. కనీసం పార్కు స్థలాన్ని సూచించేలా బోర్డు సైతం లేకపోవడం గమనార్హం. ఇక పార్క్ వెనక భాగంలో గతంలో సీసీ రోడ్డు వేయగా ఫిర్యాదులతో ఆ రోడ్డును తొలగించినప్పటికీ సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకోకపోవడంతో సమీప కాలనీలకు రహదారిగా వినియోగిస్తున్నారు. రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న విలువైన ఈ స్థలం 2వేల గజాల విస్తీర్ణంలో రూ. 3 కోట్ల వరకు ఉండగా ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నాలు జరుగుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. విలువైన స్థలాన్ని రక్షించాలని, వెంటనే పార్క్ చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేసి ఖాళీ స్థలంలో మొక్కలు నాటి సంరక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు పరిశీలన



ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్

పుల్‌కల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలానికి సంబంధించి ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్థలాలను రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్ స్థానికులతో కలిసి గ్రామ శివారులో అందుబాటులో ఉన్న పలు ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. ప్రస్తుతం కొనసాగుతున్న కూరగాయల మార్కెట్ స్థలం, రైతు వేదిక వద్ద ఉన్న ఖాళీ స్థలం, బసన్నవాగు వద్ద ఉన్న పదెకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. చౌటకూర్ వద్ద అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఇతర జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చౌకంపల్లి శివకుమార్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ పల్లె ప్రభుకుమార్‌గౌడ్, నాయకులు ఉన్నారు. కాగా చౌటకూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ నిర్వహణకు తాత్కాలికంగా భవనాన్ని ఎంపిక చేశారు. ఎంపీడీవో ఆనందమేరీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి దశరత్, ఇతర కాంగ్రెస్ నాయకులు పలు భవనాలను బుధవారం పరిశీలించారు. అందరికీ అందుబాటులో అన్నీ సౌకర్యాలతో స్థానిక బస్టాండ్ పక్కన గల ఓ ప్రైవేట్ భవనాన్ని గుర్తించారు.

సంగారెడ్డి కలెక్టరేట్‌పై నిఘా ఏదీ?

(5వ పేజీ తరువాయి)

చెట్ల కింద, భవనం పక్కన నిలిపివేస్తున్నారు. తమ పనులను చక్కబెట్టుకొని రాత్రి తీసుకెళ్తున్నారు. కొన్ని వాహనాలు రోజులకొద్దీ కలెక్టరేట్ ఆవరణలోనే ఉంటున్నట్లుగా తెలిసింది. దీనిపై నిఘా వేయాలని కలెక్టర్ సూచించినట్లు తెలిసింది.

నిఘా పెంచితేనే..

కలెక్టరేట్ ప్రవేశ ద్వారం వద్ద పోలీసులు ఉన్నా ఎలాంటి తనిఖీలు చేయడం లేదు. కార్లు, ద్విచక్రవాహనాలను ఇష్టారీతిన లోనికి అనుమతిస్తున్నారు. ఏదైనా పనికోసం కలెక్టరేట్‌కు వస్తున్నారా.. లేదా కారును పార్కింగ్ చేసేందుకు వస్తున్నారా అని ఆరా తీయడం లేదు. కలెక్టరేట్ ఆవరణలోనే ఒక్కసారి గుంపులుగుంపులుగా జనం గుమిగూడినా పట్టించుకోవడం లేదు. అలాగే, కలెక్టరేట్ ప్రాంగణంలో సీసీకెమెరాల పర్యవేక్షణ సరిగాలేదు. అక్కడక్కడా కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంటోంది. పలు శాఖల్లో లెక్కకు మించిన అటెండర్లు కనిపిస్తున్నారు. వీరి ఆయా కార్యాలయాలకు ఎవరెవరు వస్తున్నారో పర్యవేక్షించేందుకు ఉపయోగించుకునే అవకాశం ఉంది.

రూ. కోట్లు ఖర్చు చేసినా ఏం ఫాయిదా!

(5వ పేజీ తరువాయి)



జహీరాబాద్‌లో నిర్మించిన సమీకృత షెటర్లు

కాంట్రాక్టర్‌కు హామీ ఇచ్చి భవనాన్ని ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 84 వెజ్, నాన్ వెజ్ స్టాళ్లను, పై రెండు అంతస్థుల్లో 67 దుకాణాలకు గాను 40 దుకాణాలను పలువురు వ్యాపారస్థులకు మున్సిపల్ అధికారులు కేటాయించారు. పాత మార్కెట్‌లో ఉన్న వ్యాపారులకు ఒప్పందం కేటాయించిన దుకాణాలు పోనూ బహిరంగ వేలం ద్వారా మున్సిపాలిటీకీ రూ.30 లక్షల మేర ఆదాయం వచ్చింది. వేలం పూర్తయి 9 నెలలు కావడంతో తమకు కేటాయించిన షట్టర్లను అప్పగించాలని వ్యాపారులు ప్రతీరోజు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

కోట్లలో బిల్లులు బకాయి

సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రూ. 5.34 కోట్లు రావాల్సి ఉందని కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు. పెండింగ్ బిల్లులు ఇస్తేనే భవనాన్ని అప్పగిస్తానని కాంట్రాక్టర్ భీష్మించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పట్టణంలో నిర్వహించిన సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీకృత మార్కెట్ సమస్యపై ఆరా తీశారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పెండిగ్ బిల్లులు ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో రెండో అంతస్థు దుకాణాల తాళాలను అప్పగించాడు. కానీ ఇప్పటికీ బిల్లులు రాకపోవడంతో మొదటి అంతస్థును మాత్రం కాంట్రాక్టర్ ఇప్పటికీ అప్పగించలేదు. మొదటి అంతస్థు దుకాణాలు తెరవకపోవడంతో మార్కెట్ ఎదుటనే తోపుడుబళ్లపై పండ్లు, కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో, ప్రజలు మార్కెట్‌కు రారనే అంచనాతో పై అంతస్థుల్లో దుకాణాలు పొందినవారు కూడా రోడ్లపైనే విక్రయాలు సాగిస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నది.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



వెల్దుర్తిలో కొత్త గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి

చిన్నశంకరంపేట/శివ్వంపేట/వెల్దుర్తి/మాసాయిపేట. నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మెదక్ జిల్లా గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె చిన్నశంకరంపేట, శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట, మండలాల్లోని గ్రంథాలయాలను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేగోడు గ్రంథాలయ నిర్మాణానికి రూ. 50లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. వెల్దుర్తి గ్రంథాలయంలో పెండింగ్‌లో ఉన్న పనులను వేగంగా పూర్తి చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. మాసాయిపేటలో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించిన అనంతరం ముందుగా భవనానికి మరమ్మతులు చేయిస్తామని వచ్చే ఏడాది నూతన భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. అనంతరం ఆయా గ్రంథాలయాల్లో ఉన్న సమస్యలపై స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో స్థానిక సిబ్బంది, జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ వంశీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగింపుపై కౌన్సిల్ తీర్మానం

నర్సాపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణ పరిధిలో మెదక్-హైదరాబాద్, సంగారెడ్డి-తూప్రాన్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నడిచేవీలు లేకుండా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై మున్సిపల్ సమావేశంలో వాడివేడిగా చర్చ సాగింది. బుధవారం నర్సాపూర్ మున్సిపల్ సమావేశంలో చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సమావేశంలో ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. పట్టణంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపైనే ప్రధానంగా చర్చ సాగింది. ఫుట్‌పాత్ ఆక్రమణల విషయమై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కావడం, ప్రజలకు ఫుట్‌పాత్‌పై నడవడానికి కూడా అవకాశం లేకుండా ఆక్రమించడంతో, ఈ విషయమై చర్చకు తెచ్చి ఏకగ్రీవ తీర్మానం చేశారు. పట్టణంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలో నిధులు నిలిచిపోయి ఆగిపోయిన పలు అభివృద్ధి పనులు కూడా మళ్లి మొదలయ్యేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. సమావేశంలో కమిషనర్ రామకృష్ణరావు, వైస్‌చైర్మన్ నయిమోద్దిన్, కౌన్సిలర్లు యాదగిరి, సిద్దికి, సురేష్, రుక్కమ్మ, రామంచందర్, సునీతాబాలిరెడ్డి, బుచ్చేస్‌యాదవ్, రాజేందర్, లక్ష్మినగేష్, సరిత ఆంజనేయులుగౌడ్, లలితభిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

హుండీ చోరీ.. ఆటో అపహరణకు యత్నం

శివ్వంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో హుండీ అపహరణకు గురైన ఘటన చండీ గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు మండల పరిధిలో చండి చండికాంబ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు మంగళవారం రాత్రి గుడిలోని హుండీని అపహరించారని గ్రామస్థులు తెలిపారు. కాగా ఇదే గ్రామంలో ఇంటి వద్ద పార్కింగ్ చేసిన మీయ్యడి అనిల్ ఆటోను తీసుకువెళ్తుండగా ఓ వ్యక్తి అటుగా రావడంతో ఆటోను పంచాయతీ వద్ద వదిలి దుండగులు పారిపోయారన్నారు.

నిజాయితీ చాటుకున్న సెక్యూరిటీ గార్డులు

- సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి అందజేత

సంగారెడ్డి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన ఖరీదైన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి అందజేసి నిజాయితీని చాటుకున్నారు సెక్యూరిటీ గార్డులు. సంగారెడ్డి పట్టణానికి చెందిన గోటూరి రాము స్థానిక శాంతినగర్ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తాకు వెళ్లే క్రమంలో తన ఫోన్ పోగొట్టుకున్నాడు. సంగారెడ్డిలోని సిటీ హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డులుగా పని చేసే జి. రమేష్, డి. వికాస్‌కుమార్‌లు కొత్త బస్టాండ్ నుంచి విధులకు వస్తున్న క్రమంలో ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద రోడ్డుపై ఖరీదైన మొబైల్ ఫోన్ వారికి లభ్యమైంది. ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లలో ఉన్న మరో నంబర్‌కు కాల్ చేసి 'మీ ఫోన్ మాకు దొరికింది.. వచ్చి తీసుకెళ్లండి' అని తెలిపారు. వెంటనే బాధితుడు సిటీ హాస్పిటల్ వద్దకు వెళ్లగా వారు మొబైల్ ఫోన్‌ను అందజేశారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు: మెదక్ ఎస్పీ

పెద్దశంకరంపేట, నవంబరు 27: జిల్లాలో నేరాలనియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. నేరాలకు సంబంధించిన కేసులను సత్వరమే పరిష్కరించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే నెల డిసెంబరు 14న నిర్వహించే లోక్‌అదాలత్‌ను ఆయా కేసులకు సంబంధించినవారు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్,పేట ఎస్ఐ శంకర్, ఏఎస్ఐవిఠల్, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

రేగోడు నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాపన్నపేట హెడ్ కానిస్టేబుల్, రేగోడు గ్రామానికి చెందిన వీరప్ప(59) అనారోగ్యంతో బుధవారం ఉదయం మరణించారు. కొద్దిరోజులుగా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియలో మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇతర అధికారులు పాల్గొని నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల కోసం పోలీస్ శాఖ నుంచి రూ 20 వేలు నగదు భార్య బుజ్జమ్మకు అందజేశారు. శాఖ పరమైన సహాయం, కుటుంబికులకు ఉద్యోగం వచ్చేల చూస్తామని ఎస్పీ ఉదయకుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. అంత్యక్రియలో నాయకులు, అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం: ఖేడ్ ఎమ్మెల్యే



నాగల్‌గిద్ద మండలం మావినెల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రజల సంక్షేమం కొరకు వ్యవసాయం, విద్య వైద్య రంగాలకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మావినెల్లి గ్రామం నుంచి గొండెగాం వరకు దాదాపు రూ.2.15 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నాగల్‌గిద్ద మండల కేంద్రంలో దాదాపు రూ.15 లక్షల వ్యయం కాగల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే



పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్/సంగారెడ్డి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలోని 30వ వార్డులో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పూలేవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, అనంతయ్య, బీరయ్య యాదవ్, ఆంజనేయులు, అన్వర్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కాగా సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వసతులు కల్పనకు కృషి చేస్తానని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ తెలిపారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత బుధవారం ఎమ్మెల్యే చింతాప్రభాకర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కళాశాలలో సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై కళా ప్రదర్శనలు

కల్హేర్/జిన్నారం/శివ్వంపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి);రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ పథకాల అమలు గురించి బుధవారం కళా ప్రదర్శనలు నిర్వహించారు. జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కల్హేర్‌తో పాటు మండల పరిధిలోని క్రిష్టాపూర్, మాసన్‌పల్లి గ్రామాల్లో తెలంగాణా సాంస్కృతిక సారథి టీం లీడర్ కొమ్ము శేఖర్‌గౌడ్ నిర్వహణలో ఈ కళా ప్రదర్శనలు నిర్వహించారు. జిన్నారం మండలంలోని జిన్నారం, మంగంపేట, వావిలాల గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై కళాజాత కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై ప్రజలకు కళా ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. అదేవిధంగా మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

రంజోల్ గురుకుల పాఠశాలలో 'బచ్‌పన్ బచావో'

జహీరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌లో గల బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం బచ్‌పన్ బచావో కార్యక్రమం నిర్వహించారు. మండల లీగల్‌సర్వీసెస్‌కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అడ్వకేట్ ప్యానెల్ రుద్రయ్యస్వామి, రాఘవేంద్రనాయక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహ నిరోధక చట్టం, సైబర్ క్రైం అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యతోపాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలి



కొప్పోల్ సంగమేశ్వర ఆలయం వద్ద విద్యార్థుల వనభోజనాలు

పెద్దశంకరంపేట/పాపన్నపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు సంస్కారం కూడా అలవర్చుకోవాలని తొగుట ఆశ్రమపీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మాధవానంద సరస్వతీ ఆశ్రమంలో యూత్ యువ టూరిజం నేషనల్ సర్వీస్ స్కీం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవానంద సరస్వతీ స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు విద్య, విజ్ఞానం సంస్కారం క్రమశిక్షణ తదితర అంశాల పట్లసూచనలు చేశారు.

విద్యాసంస్థల్లో రెండో రోజూ ముమ్మర తనిఖీలు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బుధవారం రెండో రోజూ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వసతి గృహాలు, గురుకులాలు, అంగన్‌వాడీల్లో అందజేస్తున్న ఆహారం నాణ్యతను, వంట గదుల్లో పరిశుభ్రతను పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. పలుచోట్ల విద్యార్థులతో కలిసి అధికారులు మధ్యాహ్న భోజనం చేశారు.

-న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డిలోని ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ ఖాసీం బేగ్



తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్ కూరగాయలను పరిశీలిస్తున్న అధికారులు



నాగల్‌గిద్ద: కరస్‌గుత్తి గిరిజన బాలికల గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీవో అశోక చక్రవర్తి

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి మండలం ప్రశాంత్‌నగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్‌ను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి(డీవైఎస్‌వో), సంగారెడ్డి స్పెషల్ ఆఫీసర్ ఖాసీంబేగ్ బుధవారం సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, వంట సామగ్రి, పరిసరాలను పరిశీలించారు. కిచెన్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. కంది మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఎస్సీబాలుర కళాశాల వసతిగృహాన్ని ఆర్డీవో రాంరెడ్డి సందర్శించారు. వంటగదులను, వండిన ఆహారపదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బంది కృషిచేయాలన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలను చేయిస్తూ వ్యాధులబారిన పడకుండా చూడాల్సిన బాధ్యత వార్డన్లదేనన్నారు. కొండాపూర్ మండల పరిధిలోని గిర్మాపూర్ గురుకుల పాఠశాలను నాయబ్ తహసీల్దార్ ప్రదీప్ తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని కరస్‌గుత్తి గిరిజన బాలికల గురుకుల కళాశాలను నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి, నాగల్‌గిద్ద తహసీల్దార్ శివరామక్రిష్ణతో కలిసి తనిఖీ చేశారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి మధ్యాహ్న భోజనం తీరును, పరిశుభ్రతను పరిశీలించారు. సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు(సుల్తానాబాద్) గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను సిర్గాపూర్ మండల ఫుడ్ సేఫ్టీ కమిటీ బాధ్యులు తహసీల్దార్ ఉమాశంకర్, ఎంపీడీవో మల్సూర్ నాయక్, ఎంఈవో నాగారం శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనానికి వినియోగిస్తున్న అన్ని రకాల వస్తువులు, కూరగాయలు, బియ్యాన్ని పరిశీలించారు. కోహీర్ మండలంలోని దిగ్వాల్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని తహసీల్దార్ బాలశంకర్ పరిశీలించారు.

మెదక్ జిల్లాలో..

చేగుంట మండలంలోని ప్రభుత్వ వసతి గృహాలను మండల ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి స్వరూపారాణి, మండల అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల ఇన్చార్జి ప్రత్యేక అధికారి స్వరూప రాణి, ఎంపిడివో చిన్న రెడ్డి, మండల విద్యాధికారి నీరజ, లు స్థానిక తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాల, ఆదర్శ పాఠశాల వసతి గృహాలను సందర్శించి తనిఖీ చేశారు. వసతి గృహంలోని సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అల్లాదుర్గంలోని ఎస్సీ బాలుర, బీసీ వసతి గృహాలతో పాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, జడ్పీ(బాలికల) ఉన్నత పాఠశాలలను అల్లాదుర్గం మండల ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి కరుణాకర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రేగోడు మండలంలోని కొత్వాల్‌పల్లి, ఆర్ ఇటిక్యాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో సీతారావమ్మ సందర్శించారు. ఆహారంలో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. పెద్దశంకరంపేటలోని కేజీబీవీ, బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంతో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మెదక్ జిల్లా అధికారి సర్దార్ సింగ్, పెద్దశంకరంపేట ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కొల్చారం ప్రభుత్వ హాస్టల్‌లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ ఆదేశించారు. బుధవారం కొల్చారం సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు.